ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



అఫ్జల్‌గంజ్: ఉస్మానియా జనరల్ ఆస్పత్రిలో పని చేసే నాలుగవ తరగతి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని భారతీయ మజ్దూర్ యూనియన్ ఉస్మానియా శాఖ వర్కింగ్ ప్రెసిడెంట్ జి అనిల్ కుమార్ అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఉస్మానియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో మేల్ నర్సింగ్ ఆర్డర్లీ ఉద్యోగులకు అడిషనల్‌హెచ్‌ఆర్‌ఏ ఇచ్చేవారని గుర్తుచేశారు. గత కొంత కాలంగా నిలిపివేయడంతో ఉద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఉద్యోగుల పదోన్నతులు, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ నరేందర్, జీపీ కృష్ణ, జంగేశ్వర్, రాజు, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ ఆరు గ్యారంటీల అమలు పక్కా'



గోల్కొండ: కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను సీఎం రేవంత్‌రెడ్డి కచ్చితంగా అమలు చేస్తారని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కురాకుల కృష్ణా అన్నారు. మంగళవారం ఆయన కార్వాన్ గుడిమల్కాపూర్ డివిజన్‌లలో ఇంటింటికీ తిరిగి గృహజ్యోతిపై మహిళలను అడిగి తెలుసుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దమ్మున్న నాయకుడని ఆయన ఎప్పుడు కూడా పేదల పక్షపాతి అని ఈ సందర్భంగా కురాకుల కృష్ణా అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు కూడా అర్హులైన వారికి అందుతాయని ఈ విషయంపై ముఖ్యమంత్రి వెనుకడుగు వేయనేవేయరని ఆయన పేర్కొన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో కాంగ్రెస్ అన్ని స్థానాలను క్లీన్‌స్వీప్ చేస్తుందన్నారు.

ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ దృష్టిపెట్టాలి



గోల్కొండ: వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ దృష్టి పెట్టాలని ప్రముఖ దంత వైద్యుడు డాక్టర్ హేహసాను ద్దీన్ అన్నారు. టోలిచౌకీ ఆడమ్స్ కాలనీలోని ఆయన క్లీనిక్‌లో ఆయన చేస్తున్న సేవలకు పలువురు మజ్లిస్ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దంతాలు మన శరీరంలో ప్రధానమైనవని వాటిని ఆరోగ్యంగా ఉంచుకోవాలన్నారు. దంతాలపై నిర్లక్ష్యం చేస్తే వాటి రంగు పచ్చగా మారి పుచ్చిపోయే ప్రమాదం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది మిర్జా ఎక్బాల్ అహ్మద్, అన్వర్, సయ్యద్ సాదర్ తదితరులున్నారు.

వ్యక్తికి రెండు రోజుల జైలు

సంతోష్‌నగర్: పోలీసుల విధులకు ఆటంకం కలిగి దురుసుగా ప్రవర్తించిన కేసులో ఓ వ్యక్తికి నాంపల్లిలోని 7వ స్పెషల్ మెట్రోపాలిటన్ కోర్టు మెజిస్ట్రేట్ ఎస్.సత్యనారాయణ రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ఇన్‌స్పెక్టర్ జి.శేఖర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సాయిబాబా ఆలయం వద్ద ఈనెల 7న రాత్రి చాంద్రాయణగుట్ట ట్రాఫిక్ ఎస్సై కె. రాంబాబు తన సిబ్బందితో డ్రంకన్ డ్రైవ్ నిర్వహిస్తున్నాడు. అదే సమయంలో భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన జె.రాజు నాయక్ (31) ద్విచక్ర వాహనంపై రాగా డ్రంకన్ డ్రైవ్ తనిఖీ చేయడానికి ప్రయత్నించగా వారితో దురుసుగా మాట్లాడి విధులకు ఆటంకం కలిగించాడు. దీనిపై ఎస్సై రాంబాబు ఫిర్యాదు మేరకు కంచన్‌బాగ్ పోలీసులు కేసు నమోదు చేసుకొని రాజు నాయక్‌పై ఈ–పెట్టీ కేసు నమోదు చేసుకొని మంగళవారం నాంపల్లిలోని 7వ స్పెషల్ మెట్రోపాలిటన్ కోర్టులో హాజరుపరచగా పూర్వ పరాలను పరిశీలించిన మెజిస్ట్రేట్ ఎస్.సత్యనారాయణ రాజు నాయక్‌కు రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా రఘువీర్‌రెడ్డి



సంతోష్‌నగర్: సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా పి.రఘువీర్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన పి.శివచంద్ర బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో కుషాయిగూడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న 1998 బ్యాచ్‌కు చెందిన పి.రఘువీర్‌రెడ్డి సంతోష్‌నగర్‌కు బదిలీ చేస్తూ నగర పోలీసు కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో రఘువీర్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రానున్న పార్లమెంటు ఎన్నికలను పురస్కరించుకొని స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

'అమిత్ షా వ్యాఖ్యలు అర్థరహితం'



గౌరీ సతీష్

అబిడ్స్: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కాంగ్రెస్ పార్టీపై చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ పేర్కొన్నారు. నగరానికి వచ్చిన అమిత్‌షా తన ఇష్టారాజ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై, కాంగ్రెస్ పార్టీపై వ్యాఖ్యలు చేయడం సరైంది కాదన్నారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం విదేశాల నుంచి నల్లడబ్బు ఎందుకు తేలేదని ప్రశ్నించారు. మణిపూర్‌లో పెద్ద ఎత్తున గొడవలు కొనసాగినా మోదీ కానీ, అమిత్ షా కానీ ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించారు. పదేళ్లల్లో భారతదేశాన్ని బీజేపీ ప్రభుత్వం అన్నివిధాల నాశనం చేసిందన్నారు. రాహుల్ గాంధీ ప్రధాని అయితేనే దేశం అభివృద్ధి చెందుతుందని గౌరీ సతీష్ అన్నారు. కాంగ్రెస్‌తోనే దేశ సంక్షేమం, దేశ వికాసం కొనసాగుతుందన్నారు.

అభినందనలు

సుల్తాన్‌బజార్: ఇటీవల రాష్ట్రస్థాయి 65 కేజీల విభాగంలో పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో దేవాదాయ ధర్మాదాయ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగికి స్వర్ణ పతకం లభించడంపై ఆ శాఖ కమిషనర్ వి.అనిల్‌కుమార్ అభినందనలు తెలియజేశారు. మంగళవారం బొగ్గులకుంటలోని దేవాదాయ శాఖ కమిషనరేట్‌లో ఉద్యోగి శ్రవణ్‌కుమార్‌కు శాలువాతో సత్కరించి ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉద్యోగం చేస్తూనే క్రీడల పట్ల ఆసక్తి కనబరచడం ఎంతో అభినందనీయమన్నారు. రాష్ట్ర స్థాయిలోనే కాకుండా జాతీయ స్థాయిలో ఉద్యోగి శ్రవణ్ కుమార్ రాణించాలని ఆయన ఆకాంక్షించారు.

రంజాన్ ఉపవాస దీక్షలు షురూ..



చార్మినార్‌లో రంజాన్ మార్కెట్

- చార్మినార్ పరిసరాల్లో నెలకొన్న సందడి
- కిటకిటలాడుతున్న వ్యాపార కేంద్రాలు

చార్మినార్: రంజాన్ మాసంలోని మొదటి ఉపవాస దీక్షలు మంగళవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. పాతబస్తీలో ఏ గల్లీ చూసినా రద్దీ కనిపిస్తోంది. మార్కెట్లన్నీ కళకళలాడుతున్నాయి. చార్మినార్ ప్రధాన రోడ్డులో ఫుట్‌పాత్ విక్రయాలు రోడ్డుపైకొచ్చాయి. అంతటా రంజాన్ మార్కెట్ కొనసాగుతుంది. వినియోగదారులతో దుకాణాలన్నీ బిజీగా మారాయి. రోజా నిర్వహించే ఉపవాస దీక్షలను పురస్కరించుకొని ముస్లింలు షాపింగ్ చేస్తుండడంతో పాతబస్తీ ముఖ్య వ్యాపార కేంద్రాలన్నీ కిక్కిరిసిపోతున్నాయి.

ధనిక, పేద అనే తారతమ్యం లేకుండా..

రంజాన్ పండుగ రోజు ధనిక, పేద అనే తేడా లేకుండా ప్రతి ముస్లిం కుటుంబంలోని సభ్యులు అందరూ నూతన దుస్తులు ధరిస్తారు. ఈద్ ఉల్ ఫితర్ పండుగ రోజు తప్పనిసరిగా ముస్లింలు నూతన వస్త్రాలు ధరించడం ఆనవాయితీగా వస్తుండడంతో వాటిని ఖరీదు చేయడానికి ప్రజలు అధిక సంఖ్యలో బట్టల దుకాణాలను ఆశ్రయిస్తుంటారు. దీంతో పలు దుకాణాల యజమానులు ప్రత్యేక ఆఫర్లతో వినియోగదారులను ఆకట్టుకుంటున్నారు. దీంతో లాడ్‌బజార్, చార్మినార్, మదీనా, గుల్జార్‌హౌజ్, పత్తర్‌గట్టీ, శాలిబండ తదితర ప్రాంతాల్లో వ్యాపార కేంద్రాలు ప్రజల రద్దీతో నిండిపోయాయి.

రాత్రి వరకు..

పాతబస్తీలో ఎటుచూసినా ప్రజల రద్దీతో ఫుట్‌పాత్‌లు, దుకాణాలు కళకళలాడుతున్నాయి. ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు ఇక్కడ వ్యాపార లావాదేవీలు జరుగుతున్నాయి. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో ప్రజలు వస్తువులను ఖరీదు చేయడానికి వ్యాపార కేంద్రాలకు వస్తున్నారు.

లాడ్‌బజార్‌లో గాజుల గలగల..

మహిళలు పండుగను పురస్కరించుకొని రంగురంగుల గాజులను ఖరీదు చేయడంతో చార్మినార్‌లోని లాడ్‌బజార్ మహిళల రద్దీతో కిటకిటలాడుతోంది. రూ.10 ఖరీదు మొదలుకొని రూ.5వేల ఖరీదుకు ఇక్కడ గాజులు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. ముస్లిం మహిళలు రంజాన్ పండుగకు ప్రత్యేకంగా గాజులను ఖరీదు చేసుకొని ముచ్చటగా ధరిస్తారు. పాతబస్తీ ప్రజలే కాకుండా శివారు ప్రాంతాల జిల్లాల నుంచి కూడా అధిక సంఖ్యలో ఇక్కడికి వచ్చి గాజులను ఖరీదు చేస్తారు.

పెరిగిన అత్తర్ గిరాకీ..

రంజాన్ పండుగ రోజు ముస్లింలు అత్తర్‌కు ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తారు. ప్రతి ముస్లిం పండుగ రోజు అత్తర్‌ను తప్పకుండా వాడుతారు. దీంతో అత్తర్ దుకాణాదారులకు గిరాకీ పెరిగింది. లాడ్‌బజార్, ముర్గీచౌక్, గుల్జార్‌హౌజ్, శాలిబండ తదితర ప్రాంతాల్లోని అత్తర్ దుకాణాలు ప్రజల రద్దీతో కళకళలాడుతున్నాయి. దీంతో గుభాళించే అత్తర్ వాసనల రేట్లు కూడా ఆకాశాన్ని అంటుతున్నాయి.



మక్కా మసీదు వద్ద సందడి

భక్తిశ్రద్ధలతో తరావీ ప్రార్థనలు



హకీంపేట్‌లో తరావీ ప్రార్థనలు

గోల్కొండ: కేవలం రంజాన్ మాసంలోనే ఆచరించే తరావీ ప్రార్థనలలో ముస్లింలు భారీ ఎత్తున పాల్గొంటున్నారు. రాత్రి 8.30కు ప్రారంభమైయే ఈ తరావీ ప్రార్థనలు రాత్రి 11 గంటల వరకు కొనసాగుతున్నాయి. తరావీ ప్రార్థనలతో మసీదులు, షాదీఖానాలు కిటకిటలాడుతున్నాయి. మాసబ్‌ట్యాంక్, మెహిదీపట్నం, గోల్కొండ, టోలిచౌకీ తదితర ప్రాంతాల్లో రాత్రి కాగానే ఆధ్యాత్మిక ప్రశాంతతం నెలకొని ఉంటుంది. ఉపవాస దీక్ష విరమించగానే భోజనాలు చేసి మళ్లీ ముస్లింలు తరావీ ప్రార్థనల కోసం వస్తున్నారు. ఆసీఫ్‌నగర్, గోల్కొండ, టోలిచౌకీ తదితర ప్రాంతాల్లో తరావీ జరిగే ప్రాంతాల్లో ముస్లిం మహిళల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వయస్సుతో సంబంధం లేకుండా ముస్లింలందరూ తరావీ ప్రార్థనలు పాల్గొనాలని మౌలానా మహ్మద్ రేహాన్ ఖాత్మీ అన్నారు. మంగళవారం షేక్‌పేట్ మసీదులో జరిగిన తరావీ ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తరావీ అంటే ఖురాన్ గ్రంథ పఠనమన్నారు. తరావీ ప్రార్థనలకు సారథ్యం వహించే ఇమామ్ దివ్య ఖురాన్ గ్రంథాన్ని చదువుతారన్నారు.

కాంగ్రెస్ విజయానికి మేరు కులస్తులు కృషి చేయాలి



పోల్కం శ్రీనివాస్

అబిడ్స్: పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని తిరిగి గెలిపించేందుకు మేరు కులస్తులంతా కృషి చేయాలని మేరు యువజన సంఘం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్ మేరు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడు నెలలు అయినప్పటికీ మేరు కులస్తుల చిరకాల స్వప్నాన్ని నెరవేర్చిందన్నారు. మంగళవారం మేరు కులస్తులకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించడం ఎంతో అభినందనీయమన్నారు. 20 లక్షలకు పైగా జనాభ ఉన్న మేరు కులస్తులంతా సీఎం రేవంత్‌రెడ్డికి, ఇతర మంత్రులకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఆయన చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు తమ కులస్తులకు అండగా నిలిచారని పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు.

టప్పాచబుత్రలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ ఇస్తున్న ఇన్‌స్పెక్టర్ రాములు

విజయనగర్‌కాలనీ: శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారు ఎంతటివారైనా చట్టపరమైన చర్యలకు గురికాక తప్పదని టప్పాచబుత్ర ఇన్‌స్పెక్టర్ ఎ.రాములు హెచ్చరించారు. మంగళవారం టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, అనుమానితులను శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ..ప్రజల శాంతిభద్రతల పరిరక్షణకు ఆటంకం కలిగించే వారు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు మహ్మద్ అంజద్ షరీఫ్, అంబేద్కర్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గల్ఫ్ దేశాల్లో పెట్టుబడి పేరుతో మోసం

ఐదుగురిపై కేసు

గౌలిపురా: తమ వ్యాపారంలో డబ్బులు పెడితే అధిక లాభాలు వస్తాయని చెప్పి మోసానికి పాల్పడిన ఐదుగురిపై మొఘల్‌పురా పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ పి.నాగదుర్గా ప్రసాద్ వివరాల ప్రకారం.. చాంద్రాయణగుట్ట ప్రాంతానికి చెందిన ఫరీసా బిన్ అవద్, రయీసాబిన్ అవద్, మహ్మద్ బిన్ సలాం, సలాం బిన్ అబ్దుల్లా, అబూద్ బిన్ అవద్ గ్రూపుగా ఏర్పడి తాము గల్ఫ్ దేశాల్లో కార్ రెంటల్స్, రియల్ ఎస్టేట్, మాంసం ఎగుమతి తదితర వ్యాపారాలు నిర్వహిస్తున్నట్లు ప్రచారం చేసుకున్నారు. తమ వ్యాపారాల్లో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయంటూ ప్రజలను నమ్మించి మోసాలకు పాల్పడుతున్నారు. మొఘల్‌పురా ప్రాంతానికి చెందిన రుబీనా సుల్తానా (35)ను కలిసి తమ వ్యాపారంలో పెట్టుబడులు పెడితే లాభాలను వస్తాయని నమ్మించడంతో ఆమె తనతో పాటు తల్లి సలేహా సుల్తానా, భర్త సైఫ్ సలా హద్రమీ అకౌంట్ల నుంచి పలు దఫాలుగా రూ.25.20 లక్షలు ఆన్‌లైన్ ద్వారా చెల్లించింది. తమ డబ్బు గురించి ప్రశ్నించగా సలాం బిన్ అబ్దుల్లా, అబూద్ బిన్ అవద్ గల్ఫ్ దేశాల్లో ఉన్నట్లు ఫోన్‌లో మాట్లాడించేవారు. కొన్ని రోజుల తర్వాత ఫరీసా, అబూద్ పేరుపై చెక్కులు రుబీనా సుల్తానాకు అందజేశారు. గతేడాది ఫిబ్రవరిలో రూ.15 లక్షలు విత్‌డ్రా చేయగా అందులో తగినంత డబ్బులు లేకపోవడంతో చెక్ బౌన్స్ అయ్యింది. మోసపోయినట్లు గ్రహించి బాధితురాలు మొఘల్‌పురా పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాతబస్తీలో హీరో సుమన్ సందడి

చార్మినార్: రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ప్రముఖ సినీ నటుడు సుమన్ పాతబస్తీని సందర్శించారు. మదీనాలోని ఓ వస్త్ర దుకాణంలోని దుస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా దుకాణం యజమాని ఆబెద్ మోహియుద్దీన్ కలిసి రంజాన్ విశేషాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో ముస్లింలు అత్యంత పవిత్రంగా రోజంతా కఠోర ఉపవాస దీక్షలు చేయడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఇరు వర్గాల ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చే రంజాన్ మాసం ఎంతో పవిత్రమైందన్నారు.

నేడు అవగాహన ర్యాలీ

చార్మినార్: తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10 గంటలకు పాతబస్తీ ఫలక్ నుమాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ధూమపానంతో వచ్చే శ్వాసకోశ వ్యాధులతో పాటు గుండె జబ్బులపై అవగాహన శిబిరం, ర్యాలీని నిర్వహిస్తున్నట్లు తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ ఓ ప్రకటనలో తెలిపారు.

సదరం క్యాంప్‌నకు స్పందన

గోల్కొండ: అంగవైకల్య నిర్ధారణ పరీక్షల కోసం వచ్చే వారు తమ పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని గోల్కొండ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహరుల్లా అన్నారు. మంగళవారం గోల్కొండ ఏరియా ఆసుపత్రిలోని సదరం క్యాంప్ జరిగింది. ఈ క్యాంప్‌నకు కొందరు ఆన్‌లైన్‌లో పేరు నమోదు చేసుకోకుండానే వచ్చారు. అయితే ఆయన వారితో మాట్లాడి సదరం క్యాంప్ ప్రతి మంగళవారం జరుగుతుందని ఆన్‌లైన్‌లో పేరు నమోదు చేసుకోకపోతే తాముజారీ చేసే ధ్రువపత్రానికి విలువ ఉండదన్నారు. అనంతరం ఆయన ఆర్థోపెడిక్ డాక్టర్, ఫిజిషియన్‌లతో కలిసి మొత్తం 40 మందికి అంగవైకల్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు.

మేరు కులస్తులకు కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం



వెంకటేశ్

గౌలిపురా: మేరు కులానికి కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై రాష్ట్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర మేరు సంఘం నేత కె.వెంకటేశ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ..ఎన్నో సంవత్సరాల మేరు కులస్తుల చిరకాల ఆకాంక్ష నేడు నేరవేరిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి మేరు ఫెడరేషన్ ఏర్పాటు చేయాలని ఎన్నోసార్లు మేరు కులస్తులు పలు సందర్భాల్లో రాష్ట్ర మంత్రులకు వినతిపత్రాలు సమర్పించినా ఎలాంటి స్పందన రాలేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల వ్యవధిలోనే మేరు కులస్తులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో రాష్ట్రంలోని మేరు కులస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు.

వృద్ధుడి అదృశ్యం



సయ్యద్ సాబేర్ (ఫైల్)

గౌలిపురా: వృద్ధుడు అదృశ్యమైన ఘటన భవానీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం..భవానీనగర్ తలాబ్‌కట్టా ప్రాంతానికి చెందిన సయ్యద్ సాబేర్ (64) మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. ఈనెల 10న సాయంత్రం 4 గంటలకు సయ్యద్ సాబేర్ ఇంట్లో కుటుంబసభ్యులకు చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాల్లో వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో తన తండ్రి కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

డిజిటల్ వస్తుసేవల వినియోగంపై అవగాహన సదస్సు



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న శాస్త్రి

చార్మినార్: వినియోగదారులు లేకుండా వ్యాపార రంగాల అభివృద్ధి సాధ్యం కాదని, అందుకే నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉత్తమ వస్తుసేవలను అందించాలని బీఐఎస్ పూర్వ అధ్యక్షుడు ఏ.పీ.శాస్త్రి అన్నారు. ఈనెల 15న ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సిటీ కాలేజి స్టాండర్డ్ క్లబ్, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ సంయుక్తంగా సదస్సు నిర్వహించాయి. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. టెక్నాలజీ సేవలు విస్తృతంగా పెరుగుతున్న నేపథ్యంలో 2024వ సంవత్సరానికి 'వినియోగదారుల కోసం న్యాయమైన, బాధ్యతాయుతమైన ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్'అనే నినాదాన్ని ఐక్యరాజ్య సమితి ప్రకటించిందన్నారు. విద్యార్థులు ఈ విషయమై విషయ పరిజ్ఞానం పెంచుకోవటమే కాక తమ ఇంట్లోని వారికి, తెలిసిన వారికి అవగాహన కలిగించాలన్నారు. స్టాండర్డ్ క్లబ్ మెంటర్ డా.వై.వాసుదేవ రెడ్డి సమన్వయం చేసిన ఈ కార్యక్రమంలో కామర్స్ విభాగం అధ్యక్షుడు డా.రత్న ప్రభాకర్ మాట్లాడుతూ.. వినియోగదారుల హక్కుల గురించి అందరికీ అవగాహన ఉండాలన్నారు. అనంతరం నిర్వహించిన వ్యాసరచన పోటీలో గెలిచిన పూజ మీనా, కావ్య, జగదీష్, నాగు, ఉదయ్ కిరణ్, మురళీ కృష్ణ తదితర విద్యార్థులకు రూ.15000 నగదు బహుమతులను అందజేశారు.

వ్యాయామ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణలో క్రీడల అభివృద్ధితో పాటు వ్యాయామ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ కోరింది. మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం సంస్థ ప్రధాన కార్యదర్శి పి.కృష్ణమూర్తిగౌడ్ మాట్లాడుతూ..పీఈటీల అప్‌గ్రేడ్ విషయం న్యాయస్థానంలో ఉందని ఈ అంశంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అర్హత కలిగిన పీఈటీలను జూనియర్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్లుగా పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న పీఈటీ, పీడీ ఉపాధ్యాయులకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి నూతన క్రీడా పద్ధతులపై శిక్షణా తరగతులు నిర్వహించాలన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుల సమస్యలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు ఎ.సోమశేఖర్, ఎస్.వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు పేదలకు వరం



లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: సంక్షేమ పథకాలు పేదలకు వరంలాంటివని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం టోలిచౌకీలో ఆయన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను వాటి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల వేలాది కుటుంబాల వారికి ప్రయోజనం చేకూరిందన్నారు. ముఖ్యంగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు నిరుపేదల కుటుంబాల వారికి ఒక కామధేనువుగా మారిందన్నారు. ముఖ్యంగా స్వయం ఉపాధి కోసం కూడా ఎన్నో పథకాలు ఉన్నాయని అయితే వాటిని తెలుసుకొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. యువతీ యువకులు సొంతంగా వ్యాపారం చేసుకోవడానికి ప్రభుత్వ ఆర్థిక సంస్థలు సబ్సిడీలపై రుణాలు ఇస్తున్నాయన్నారు.

'ఫిర్ ఏక్ బార్ బీజేపీ సర్కార్'



బీజేపీ ప్రదర్శనలో ముక్క కృష్ణాగుప్తా తదితరులు

అబిడ్స్: బీజేపీ మరోసారి అధికారంలోకి వచ్చి దేశాన్ని ప్రపంచంలోనే నెంబర్:1 గా తీర్చిదిద్దుతుందని గోల్కొండ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి ముక్క కృష్ణాగుప్తా పేర్కొన్నారు. ఎల్బీస్టేడియంలో జరిగిన బీజేపీ విజయ సంకల్ప మహా సమ్మేళనానికి భారీ ఎత్తున గోషామహల్ నుంచి బీజేపీ నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ముక్కా కృష్ణాగుప్తా మాట్లాడుతూ..ఫిర్ ఏక్ బార్ మోదీ సర్కార్ అని కార్యకర్తలంతా బీజేపీ గెలిచే విధంగా కృషి చేయాలన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. మోదీ ప్రధాని కావడంతోనే దేశం పదేళ్లుగా ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. కాంగ్రెస్ మాయమాటలు ప్రజలు నమ్మవద్దని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో లడ్డూ యాదవ్, బోయిన దర్శన్, రాజేందర్, రాజేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి ఆలయ అక్రమాలపై ప్రజావాణిలో ఫిర్యాదు



ఫిర్యాదు చేసిన చిత్రం సురేష్‌కుమార్ తదితరులు

అబిడ్స్: మురళీధర్‌బాగ్‌లోని మహాలక్ష్మి ఆలయంలో అక్రమాలు జరుగుతున్నాయని లక్ష్మీనరసింహ స్వామి సేవా సమితి గ్రేటర్ అధ్యక్షుడు చిత్రం సురేష్‌కుమార్ పేర్కొన్నారు. మహాలక్ష్మి ఆలయంలో హుండీలలో వచ్చే డబ్బుల లెక్క పత్రాలు లేవన్నారు. మంగళవారం ప్రగతి భవన్‌లోని ప్రజావాణిలో మహాలక్ష్మి ఆలయ అక్రమాలపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. ఆలయానికి సంబంధించిన షాపులు ఇతర ఆస్తులపై కూడా ప్రభుత్వం విచారణ జరిపి కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగిళ్ల రమేష్, డి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



చెక్కులు అందజేస్తున్న కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్

సుల్తాన్‌బజార్: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జాంబాగ్ బీజేపీ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ అన్నారు. మంగళవారం 45 కల్యాణలక్ష్మి, 40 షాదీ ముబారక్ చెక్కులను కార్పొరేటర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆడపిల్లలకు పెళ్లి కానుకగా ప్రవేశపెట్టిన షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి పథకాలపై ఆడపిల్లల తల్లిదండ్రులు ఉపయోగించుకోవాలి సూచించారు. ఇలాంటి పథకాలలో ఏమైనా సందేహాలు ఉంటే తన కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోషామహల్ కార్పొరేటర్ లాల్‌సింగ్, కృష్ణ, ఉషాబాయి తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు

చాంద్రాయణగుట్ట: ఛత్రినాక పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన వి.శ్రీనివాస్‌రెడ్డిని కాంగ్రెస్ టీపీసీసీ కార్యదర్శి డి.ఎల్.నర్సింగ్ గౌడ్ మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయనతో పాటు గౌడ సంఘం ప్రతినిధులు నరేష్ గౌడ్, భద్రీనాథ్‌గౌడ్ కలిసి పూలబొకే అందజేశారు.



విజ్ఞానయాత్రతో విద్యార్థుల మేధస్సుకు పదును

గోల్కొండ: విజ్ఞానయాత్రలు విద్యార్థుల మేధస్సుకు పదును పెడతాయని వీనస్ విద్యా సంస్థల కరస్పాండెంటెండ్ మహ్మద్ హిదాయత్‌ఆలీఖాన్ అన్నారు. టోలిచౌకీ డిలక్స్ కాలనీలోని వీనస్ హైస్కూల్ విద్యార్థులు మంగళవారం విజ్ఞానయాత్రకు వెళ్లారు. ఇందులో భాగంగా ఆయన విద్యార్థులతో అంబర్‌పేట్‌లోని జిందా తిలిస్మాత్ ఖార్ఖానాను సందర్శించారు. ఈ సందర్భంగా జిందా తిలిస్మాత్ ప్రతినిధి విద్యార్థులకు ఖార్ఖానాలో కలియ తిప్పి జిందా తిలిస్మాత్ టూత్‌పేస్ట్ తదితర పదార్థాలు తయారైయ్యే విధానాన్ని చూపెట్టారు. అనంతరం మహ్మద్ హిదాయత్ అలీఖాన్ మాట్లాడుతూ..విజ్ఞానంతో పాటు వినోద యాత్రలు విద్యార్థులకు ఎంతగానో దోహదపడతాయన్నారు.